క్లుప్తంగా

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

కాజులూరు: జగనన్న ఆరోగ్య సురక్ష–2లో భాగంగా మంగళవారం గొల్లపాలెంలో జరగనున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. సోమవారం గ్రామంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మార్కెట్ సెంటర్‌లోని మండల పరిషత్ పాఠశాల ఆవరణలో జరిగే ఈ శిబిరంలో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు సేవలందిస్తారన్నారు. బీపీ, షుగర్, పలు దీర్ఘకాలిక వ్యాధులపైన పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మరింత మెరుగైన చికిత్స అవసరమని గుర్తించిన వారికి వైఎస్సార్ ఆరోగ్య పథకం ద్వారా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స నందిస్తామని రోగులకు అవసరమైన మందులు ఉచితంగా అందిస్తారన్నారు.

రెండు బైకులు ఢీ: ఇద్దరికి తీవ్ర గాయాలు

మామిడికుదురు: పాశర్లపూడి–బోడసకుర్రు గ్రామాల మధ్యలోని వైనతేయ గోదావరి నదిపై నిర్మించిన వారధిపై సోమవారం రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పి.గన్నవరం మండలం నాగుల్లంకకు చెందిన రెడ్డి చిన వెంకటసత్యనారాయణ, గౌరీ పార్వతి దంపతులు అయినాపురం నుంచి బైకుపై వస్తుండగా, పాశర్లపూడి నుంచి మరో బైక్‌పై వెళ్తున్న అల్లవరం మండలం బోడసకుర్రుకు చెందిన మొగలి రవి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో రెడ్డి గౌరీ పార్వతి, మొగలి రవి తీవ్రంగా గాయపడ్డారు. వారిని మండల అమలాపురం ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై నగరం పోలీసులకు ఆస్పత్రి వర్గాలు సమాచారం అందించారు. ఎస్సై పి.సురేష్ ఈ ప్రమాదంపై విచారణ చేపట్టారు.

యువకుడి మృతి

ఆత్రేయపురం: మండలంలోని నార్కెడిమిల్లి గ్రామానికి చెందిన నల్లి శ్రీకాంత్ (23) పురుగుమందు తాగి మృతి చెందినట్టు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. యువకుడు బీటెక్ పూర్తి చేశాడు. ఈనెల 17న పురుగుమందు తాగాడు. దీంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్టు వచ్చిన సమాచారం మేరకు కేసు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వైభవంగా చిన్నశేష, హంస వాహనోత్సవాలు

రావులపాలెం: అలమేలు మంగా పద్మావతి అండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి 15వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం స్వామివారికి చిన్నశేష, హంస వాహనోత్సవాల సేవలు నిర్వహించారు. తొలుతగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి ఉదయాన్నే సుప్రభాత సేవ, సహస్ర నామార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని చిన్న శేషవాహనంపై గోవిందనామ ధ్వనుల నడుమ ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు వాడపల్లి కమలనాథాచార్యులు ఆధ్వర్యంలో వేద పూజలు జరిపారు. రాత్రికి స్వామివారికి హంస వాహనోత్సవ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వాహనాల తనిఖీ

అంబాజీపేట: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని అంబాజీపేట మండలంలో ప్రధాన రహదారిపై వెళుతున్న వాహనాలను పోలీసులు సోమవారం తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై కె.చిరంజీవి పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. అక్రమంగా మద్యం తరలించినా, ఎటువంటి ఆధారాలు లేకుండా నగదును తరలిస్తున్నా సమాచారం చేస్తామని హెచ్చరించారు.

చింతలలంకలో..

అయినవిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సీఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ బృందాలతో వాహనాల తనిఖీ జోరుగా నిర్వహిస్తున్నారు. సోమవారం చింతనలంకలో సీఐ, ఎస్సై బి.రాజేష్‌కుమార్ బృందాలుగా ఏర్పడి ఎన్నికల సందర్భంగా మద్యం, నగదు డంప్ కాకుండా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమైన కూడలిలో బీటు వేసి అనుమానం వచ్చిన వాహనాలు ఆపి వాటిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. వీటికి సంబంధించిన బిల్లులను పరిశీలిస్తున్నారు.

పేదల పక్షపాతి జగన్

కొత్తపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల పక్షపాతి అని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని వానపల్లి గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు ముమ్మిడి కృష్ణ గోపాలపురం వెద్ద ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కృష్ణకు జగ్గిరెడ్డి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే కాదు దేశ చరిత్రలోనే ఎప్పుడూ ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం, ముఖ్యంగా అభివృద్ధికి ఎన్నో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ఆ ప్రజానీకం అండదండలతోనే వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ అత్యధిక స్థానాలతో అధికారం చేపట్టబోతున్నాం. కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, కొత్తపేట పార్టీ నాయకులు మూర్కొండ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం కృషి

- లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు
- కిల్‌కారీ సేవలతో మాతా శిశు సంరక్షణ
- రెండు నియోజకవర్గాల్లో మెరుగుపడిన వైద్యసేవలు



అంగర పీహెచ్‌సీలో గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ (ఫైల్)

కపిలేశ్వరపురం: మాతా, శిశు సంరక్షణే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశేష కృషి చేస్తున్నాయి. లింగ భేద భావనతో కడుపులోని బిడ్డను చిదిమేసేందుకు కారణమయ్యే గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పీసీపీఎన్‌డీటీ) చట్టం పటిష్ట అమలుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయి.

పటిష్టమైన చట్టం బిడ్డకు శ్రీరామరక్ష

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం– 1994 అమలు కడుపులోని బిడ్డకు శ్రీరామరక్ష. బిడ్డను చిదిమేసే ఆలోచన ఎవరికి వచ్చినా శిక్షకు సిద్ధంగా ఉండాలని ఈ చట్టం చెబుతుంది. ప్రభుత్వం వద్ద లైసెన్స్ పొందిన స్కానింగ్ సెంటర్లు నిబంధనలను మీరితే చర్యలు తీసుకుంటుంది. అల్ట్రా సౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్టరీత్యా నేరం. అలా చేసే స్కానింగ్ సెంటర్ లైసెన్స్ రద్దవడంతో పాటు వైద్యులపై కేసు నమోదు చేస్తారు. నేరం రుజువైతే మూడేళ్ల జైలు శిక్ష, రూ.పది వేలు జరిమానా విధించే అవకాశం ఉందని చట్టం చెబుతుంది.

రెండు నియోజకవర్గాల్లో స్కానింగ్ సెంటర్లు ఇలా..

గర్భంలోని పిండం ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ప్రభుత్వం ఏరియా ఆసుపత్రి, సీహెచ్‌సీల్లో స్కానింగ్ పరికరాలను సమకూర్చింది. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి, కపిలేశ్వరపురం, మండపేట, ఆలమూరు, కొత్తపేట సీహెచ్‌సీల్లో స్కానింగ్ పరికరాలున్నాయి. అవి కాకుండా రామచంద్రపురం, మండపేట పట్టణాల్లో మూడు చొప్పున ప్రైవేటు స్కానింగ్ సెంటర్లున్నాయి.

అవగాహన కార్యక్రమాలు

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడంలో గల నష్టాలను వివరించడంతో పాటు గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం– 1994 చట్టం అమలు పరిధిని వివరిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల సిబ్బందికి అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేస్తున్నట్టు తెలిస్తే 18004253365 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసే ఏర్పాటు చేశారు.

డెకాయ్ ఆపరేషన్లు

భ్రూణ హత్యలు, లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 1994లో ప్రీ కన్సెప్షన్ అండ్ ప్రీ నాటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ (పీసీపీఎన్‌డీటీ) చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, భ్రూణ హత్యలు చేయడం నేరం. చట్టం అమలులో భాగంగా డెకాయ్ ఆపరేషన్ పేరుతో మూడు నెలలకు ఒకసారి స్కానింగ్ సెంటర్లను అధికారులు తనిఖీ చేస్తున్నారు.

తల్లీబిడ్డ రక్షణకు కిల్కారీ సేవలు

కిల్కారీ అనే హిందీ పదానికి చిన్నారి చిరునవ్వు అని అర్థం. వైద్యసేవలందించడంతో పాటు ఇంటి వద్ద ఉన్న గర్భిణీ, బాలింతలకు ఫోన్ ద్వారా యోగ క్షేమాలను అడిగి తెలుసుకోవడం కిల్కారీ సేవ లక్ష్యం. గర్భందాల్చిన నాల్గో నెల నుంచి కిల్కారీ సేవలు ప్రారంభమవుతాయి. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆరోగ్య నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై వారిని అప్రమత్తం చేయడం కార్యక్రమ లక్ష్యం. గర్భిణులు బాలింతలకు నేరుగా మహిళా డాక్టర్ ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీసి ధైర్యం చెప్తారు. అందుకోసం గర్భిణి, బాలింతల వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు.

మాతా శిశు సంరక్షణ నిలయంగా ప్రభుత్వ ఆసుపత్రి



మాతా శిశు సంరక్షణకు నిలయంగా ప్రభుత్వ ఆసుపత్రులు నిలుస్తున్నాయి. గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డ పుట్టిగా కోలుకునే వరకూ క్రమ పద్ధతిలో వైద్య పరీక్షలు చేస్తూ తల్లీ బిడ్డలను సంరక్షించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేస్తుంది. అందుకోసం వైద్యులు, వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలంతా శ్రమిస్తున్నారు.

– పి.రత్నకుమారి, వైద్యాధికారి, అంగర పీహెచ్‌సీ, కపిలేశ్వరపురం

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



నదురుబాదలో కవాతు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ బలగాలు

రాయవరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని నదురుబాదలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మండపేట రూరల్ సీఐ శ్రీధర్ కుమార్, రాయవరం ఎస్సై నరేష్ మాట్లాడారు. ముందుగా నదురుబాద, వసలపూడి గ్రామాల్లో సీఐఎస్ఎఫ్ బలగాలు కవాతు నిర్వహించారు.

రంచనుగా పింఛను ఇచ్చేది

వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే..



రామచంద్రపురంలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న పిల్లి సూర్యప్రకాష్

కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్

రామచంద్రపురం: సామాజిక పింఛన్లు ప్రతి నెలా ఒకటో తేదీనే అందించే ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. పట్టణంలోని చింతపల్లి సూరన్న గరిలో గడప గడపకు వైఎస్సార్ సీపీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సూర్యప్రకాష్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పనిచేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, నాయకులు గుత్తుల వీరన్నశెట్టి, కుడుపూడి భీమశంకరం, దంగేటి సూరిబాబు, కుడుపూడి రామకృష్ణ, యనమదల మల్లి, గుత్తుల స్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్రీసీతారామ లక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠ

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల తూర్పు వీధి రామాలయంలో సోమవారం నూతన సీతారామ లక్ష్మణ విగ్రహ పునః ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది. వైఖానస పద్ధతిలో ప్రముఖ వేద పండితుల వాడపల్లి గోపాలాచార్యస్వామి ఆధ్వర్యంలో పురోహితుల బృందం ఈ ప్రతిష్టాపన మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం యంత్ర స్థాపన, కళావాహన గోదర్శనం, శాంతికారక కల్యాణం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఈ ఉత్సవాన్ని తిలకించారు. ఈసందర్భంగా నూతన విగ్రహాలను ప్రత్యేక పల్లకీపై ఊరేగింపు జరిపారు. ఆలాగే ఆలయం వద్ద ఏర్పాటు చేసినటువంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆరు ఇసుక, బొండుమట్టి లారీల సీజ్

అయినవిల్లి: రావులపాలెం నుంచి అయినవిల్లి మండలం మీదుగా ముమ్మిడివరం వెళ్తున్న మూడు ఇసుక, మూడు బొండు మట్టి లారీలను సీఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై బి.రాజేష్‌కుమార్ తన సిబ్బందితో పట్టుకుని సీజ్ చేశారు. ఇసుక, బొండు మట్టికి సంబంధించి ఏ విధమైన రశీదులు చూపించకపోవడంతో వీటిని తదుపరి చర్యలు కోసం సీజ్ చేసి అయినవిల్లి తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించినట్టు ఎస్సై తెలిపారు.

నూకాంబిక అమ్మవారి ఉత్సవాలపై సమీక్ష

- అధికారులందరూ సమన్వయంతో పని చేయాలి
- కొత్తపేట ఆర్డీవో జీవీవీ సూచన



ఆలమూరు తహసీల్దార్ కార్యాలయంలో నూకాంబిక అమ్మవారి ఉత్సవాలపై ఆర్డీవో సమీక్ష

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలపై సోమవారం సమీక్ష జరిగింది. ఆలమూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ డీఎస్ ఆనిలకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఈవో ఎంఎస్ఆర్ కృష్ణ అధ్యక్షత వహించగా కొత్తపేట ఆర్డీవో కొత్తపేట ఆర్డీవో, ఉత్సవ కోఆర్డినేషన్ ఛైర్మన్ జీవీవీ సత్యనారాయణ, జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, రామచంద్రపురం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలాజీ రాంప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఏప్రిల్ ఏడున జాతర, ఎనిమిదిన తీర్థం మహోత్సవం జరగనుండటంతో, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పనకు తీసుకోవలసిన చర్యలపై మండల స్థాయి అధికారులు సమీక్ష జరిపారు. వైద్యారోగ్యశాఖ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలతో చర్చలు జరిపి జాతర, తీర్థ మహోత్సవాల నిర్వహణకు తీసుకోవలసిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, వేసవి దృష్ట్యా తాగునీటి కొరత రాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసుకోవాలని అగ్నిమాపక దళ వాహనాన్ని అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. ఈసందర్భంగా స్థానికులు, అధికారులతో చర్చించి తగిన సలహాలు అందజేసి సూచనలు స్వీకరించారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

ఏప్రిల్ ఏడు నుంచి నెల రోజుల పాటు నిర్వహించే నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాల దృష్ట్యా ఆలయ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా దేవదాయశాఖను ఆర్డీవో జీవీవీ కోరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. లక్షలాది మంది భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉన్నందున అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. డీఎల్‌పీఓ రాజేశ్వరరావు, ఎంపీడీఓ ఎ.మేరీ రోజ్, ఎంపీవో రామ్‌కుమార్, ఎస్సై ఎల్.శ్రీను నాయక్, జేపీ డి.భాస్కర శ్రీనివాస్, వైద్యాధికారి పి.భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురం: గ్రామంలో వేంచేసిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారి గరుడ వాహనోత్సవం, మహాసుదర్శన హోమం తదితర పూజలను ఆలయ చైర్మన్ పాతపాటి వెంకట సత్యనారాయణరాజు– రాజ్యలక్ష్మి దంపతులు, సోదరులు, కుటుంబ సభ్యులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామికి సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం తదితర పూజలను వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో పూజలను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం శంఖ, చక్ర నామార్చన, హారతి, తీర్థప్రసాదాలను వితరణ చేశారు. ఆలాగే గరుడ వాహనంపై స్వామి వారిని గ్రామంలో ప్రధాన వీధుల గుండా వైభవంగా గరుడ వాహనోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా మాజీ టీటీడీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, అన్నపూర్ణ దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వార్ని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివార్ని ప్రత్యేక పుష్పాల తో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు నిర్వహించారు.

నేటి కార్యక్రమాలు

ఉదయం సంకల్పం, విష్వక్సేన సేవ, పుణ్యాహవచనం, మహాశాంతి హోమం, పూర్ణాహుతి, స్వామివారి చక్రస్నానం,ద్వజారోహణం, హారతి, తీర్థ ప్రసాదాలు, విశేష అన్న సమారాధన, పల్లకీ సేవ, సాయంత్రం సంకల్పం, విష్వక్సేనపూజ, పుణ్యాహవనం, స్వామి వారికి పుష్పయాగం, ఏకాంత సేవ దర్శనం, తీర్థ ప్రసాదాలతో కార్యక్రమాలు ముగుస్తాయని ఆలయ చైర్మన్ రమణరాజు తెలిపారు.

కిడ్నీ బాధిత చిన్నారికి ఆర్థిక సాయం



పాపకు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు రూ.23 వేల ఆర్థిక సాయం అందజేసినట్టు సభ్యులు సోమవారం తెలిపారు. మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన పాలూరి మీనాక్షి నాగేశ్వరమ్మ (3) కిడ్నీ సంబంధించిన వ్యాధితో బాధపడుతుంది. ఈ పాప తండ్రి చనిపోయారు. తల్లి దారా బట్టలను ఉతికి పాపకు వైద్యం చేయిస్తున్నారు. వైద్యానికి చాలా ఖర్చు అవుతుండటంతో అంత స్తోమత లేకపోవడంతో కాశీ అన్నపూర్ణ దేవి సేవా సంస్థను సహాయం కోరారు. దీంతో పాప ఇంటికి వెళ్లి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.23 వేల నగదు సాయాన్ని అందజేసినట్టు తెలిపారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు



కపిలేశ్వరపురం కేంద్రంలో రూమ్ సిట్టింగ్‌ను చూసుకుంటున్న విద్యార్థులు



కపిలేశ్వరపురం కేంద్రంలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు



రాయవరం జెడ్పీ హైస్కూల్లో పరీక్ష రాయడానికి వస్తున్న విద్యార్థులు



ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ వద్ద తనిఖీ చేసి విద్యార్థులను పరీక్ష కేంద్రానికి పంపుతున్న ఉపాధ్యాయులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం, మండలంలోని రూరల్ గ్రామాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఎంతటి చింతా వెంకటసోమిరెడ్డి వర్యవేక్షణలో సిబ్బంది తగిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. మరో ఎంఈఓ ఎం.రామచంద్రరావు ఫ్లైయింగ్ స్క్వాడ్ బాధ్యతల్లో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మండలంలో 1,915 మందికి 1,889 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 26 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 9 కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఆయా కేంద్రాలు వద్ద నిర్వహించిన వైద్య శిబిరాల్లో ద్వారపూడి, కేశవరం పీహెచ్‌సీల వైద్య, ఆరోగ్య సిబ్బంది సేవలందించారు.

కపిలేశ్వరపురం మండలంలో నలుగురు గైర్హాజరు

కపిలేశ్వరపురం: మండలంలోని పరీక్ష కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు, కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒకటి మొత్తం మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో 460 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 456 మంది రాశారు. నలుగురు గైర్హాజరయ్యారు. గైర్హాజరైన వారిలో ముగ్గురు బాలురు, ఒక బాలిక ఉన్నారు. పరీక్షా కేంద్రాలను రామచంద్రపురం డీఎస్పీ ఎన్.రామకృష్ణ, ఎంపీడీఓ పి.వీణాదేవి సందర్శించారు. ఆయా కేంద్రాల్లో అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి పర్యవేక్షణలో వైద్య శిబిరాలను నిర్వహించారు. కపిలేశ్వరపురం పరీక్షా కేంద్రంలో సీఎస్‌గా వాకతిప్ప జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పి.వాసంతి, డీఓగా వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పి.సూర్యచంద్రరావు వ్యవహరించారు. అంగర–ఏ కేంద్రంలో సీఎస్‌గా పీవీ బ్రహ్మానందం, డీఓగా టీవీఎస్ సురేంద్రనాథ్ రి, అంగర–బి కేంద్రంలోక సీఎస్‌గా డి.త్రిమూర్తులు, డీఓగా కె.చిన్నబాబు వ్యవహరించారు. పరీక్షల ఏర్పాట్లను ఎంఈఓ కె.ఆనందరావు పర్యవేక్షించారు.

రాయవరం: పదవ తరగతి పరీక్షలు సోమవారం మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. రాయవరంలోని శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు, చెల్లూరు, పసలపూడి గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఒక్కొక్క పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రాయవరం జెడ్పీహెచ్ఎస్–ఎ పరీక్షా కేంద్రంలో 170, జెడ్పీహెచ్ఎస్–బి కేంద్రంలో 229, పసలపూడి జెడ్పీహెచ్ఎస్ 170, చెల్లూరు జెడ్పీహెచ్ఎస్‌లో 142 మంది విద్యార్థులను కేటాయించారు. నాలుగు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 732 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, రాయవరం –ఎ పరీక్షా కేంద్రంలో 11–బి పరీక్షా కేంద్రంలో ఒకరు, పసలపూడిలో ఇరువురు, చెల్లూరులో ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. రాయవరం–1, 2, చెల్లూరు, పసలపూడిలో చీఫ్ సూపరింటెండెంట్లుగా రాజ్యలక్ష్మి, పి.శ్రీనివాస్, పి.వెంకటేశ్వరరావు, సీహెచ్.ఆదినారాయణ వ్యవహరించారు.

కాజులూరు: మండల గ్రామాల్లో సోమవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని కోలంక, కాజులూరు, గొల్లపాలెం కేంద్రాల్లో మొత్తం 651 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా కోలంక పరీక్ష కేంద్రంలో 213 మందికి 209 మంది హాజరవగా నలుగురు హాజరు కాలేదు. గొల్లపాలెం పరీక్ష కేంద్రంలో 180 మందికి 179 విద్యార్థులు పరీక్షకు హాజరై ఒకరు గైర్హాజరవగా కాజులూరు పరీక్ష కేంద్రంలో 258 మందికి నూరుశాతం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు ఎంఈఓ వివేకానంద తెలిపారు. ఉదయం 9.30 నిమిషాలకు పరీక్ష ప్రారంభం కాగా దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేందుకు విద్యార్థులకు తాగునీరు తదితర వసతులు ఏర్పాటు చేసినట్టు ఎంఈఓ తెలిపారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: మండలంలోని పదో తరగతి పరీక్షలు తొలి రోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని పామర్రు, కోటిపల్లి, కె.గంగవరం, దంగేరు ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సెంటర్లకి ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు చేరుకుని రూం నెంబర్లను సరిచేసుకున్నారు. విద్యార్థులకు ధైర్యం చెప్పేందుకు తల్లిదండ్రులు సెంటర్ వద్దకు చేరుకుని పరీక్ష హాలు పంపి వెళ్ళేంత వరకు వేచి చూశారు. పామర్రు ఉన్నత పాఠశాలలో 168 మంది విద్యార్థులకు 8 పరీక్షలకు గైర్హాజరయ్యారు. కోటిపల్లిలో 86 మంది విద్యార్థులకు 83 మంది హాజరు కాగా కె.గంగవరంలో కూడా 140 మంది విద్యార్థులకు 135 మంది హాజరయ్యారు. దంగేరు సెంటర్‌లో 79 మంది విద్యార్థులకు 76 మంది హాజరైనట్లు తొలి రోజు తెలుగు పరీక్షకు రాశారు. ఎండాకాలం కావడంతో విద్యార్థులకు ఫ్యాన్లు ఉన్నా ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు. నాలుగు పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు మంచి నీటి సౌకర్యంతో పాటు మరుగుదొడ్ల సౌకర్యం కూడా ఏర్పాటు చేశారు.

రామచంద్రపురం రూరల్‌లో..

రామచంద్రపురం రూరల్: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్షకు మండలంలోని 9 పరీక్ష కేంద్రాల్లో 1,702 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 1,651 మంది విద్యార్థులు పరీక్ష రాశారని ఎంఈఓలు మానుపూడి శ్రీనివాస్, వానపల్లి నాగేశ్వరరావు తెలిపారు. 51 మంది విద్యార్థులు తెలుగు పరీక్షకు గైర్హాజరయ్యారన్నారు. కాగా మొదటి పరీక్షకు విద్యార్థులు తల్లిదండ్రులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులను, వారికి తోడుగా వచ్చిన తల్లిదండ్రులతో సందడి నెలకొంది. రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐ పి.దొరరాజు, ద్రాక్షారామ, రామచంద్రపురం ఎస్సైలు జి.సురేంద్ర, బి.సురేష్‌బాబుల పర్యవేక్షణలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



కపిలేశ్వరపురం కేంద్రంలో పరీక్ష రాసేందుకు పరుగు తీస్తున్న విద్యార్థులు